

పెద్ద దర్గాను సందర్శించిన గాయని మంగ్లీ

ప్రజాశక్తి -కడప అర్బన్

ప్రపంచ ప్రసిద్ధి గాంచిన కడప అమీన్‌పీర్ దర్గాను ప్రముఖ గాయని మంగ్లీ మంగళవారం సందర్శించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా సంప్రదాయ ప్రకారం గాయని మంగ్లీకి ముజావర్లు స్వాగతం పలికారు. దర్గా విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



దర్గాను సందర్శిస్తున్న గాయని మంగ్లీ

ఇసుక మేట.. గుండెకోత



అన్నమయ్య ప్రాజెక్టు నిర్వాసితులకు కన్నీటి వరద కొనసాగుతోంది. అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ నాయకుల అలక్ష్యం వెరసి తమ కష్టాలకు కారణమనే వాదన వినిపిస్తోంది. వరద విలయానికి ఏడాది గడిచినప్పటికీ తమ పొలాల్లో తిష్ట వేసిన ఇసుక మేటలను తొలగించకపోవడంలో తాత్సారం, భూముల హద్దులు చెరిగిన నేపథ్యంలో భూసర్వే చేపట్టకపోవడంతో పంటల సాగుకు యోగ్యంకాని దుస్థితి దాపురించింది. ఫలితంగా సుమారు 1000 ఎకరాల్లో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైంది. వ్యవసాయం లేకపోవడంతో కూలి పనులు చేసుకోవడానికి పనులు లేకపోవడం, జిల్లా అధికార యంత్రాంగం కనీసం ఉపాధి హామీ పనులు కల్పించకపోవడం వెరసి నిర్వాసితుల దౌర్భాగ్య పరిస్థితులపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం.

- అన్నమయ్య ప్రాజెక్టు నిర్వాసిత గ్రామాల్లో ఎటు చూసినా ఇసుక మేటలే
- 927 ఎకరాల ఫ(పొ)లాలు ఛిద్రం
- 'రాజకీయం' గుప్పిట్లో విలవిల
- నేటికీ తేరుకోని నిర్వాసితులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జవాద్ ధాటికి అన్నమయ్య రిజర్వాయర్ అస్తిత్వం గల్లంతైంది. అన్నమయ్య జిల్లాలోని రాజంపేట-నందలూరు మండలాల పరిధిలోని పులపుత్తూరు, మందపల్లి, తోగూరుపేట, రామచంద్రాపురం, గుండ్లూరు, శేషమాంబపురం గ్రామాలు మొదలుకుని సుమారు 19 గ్రామాలను వరద చుట్టు ముట్టేసింది. ఫలితంగా జన, ధన, ప్రాణ, ఆస్తి నష్టాలు వెరసి అపార నష్టం వాటిల్లింది. వరద విలయం ధాటికి పంట పొలాల్లో పెద్దఎత్తున ఇసుక మేటలు వేయడం వేదనకు గురిచేస్తోంది. మేటలను తొలగించడానికి ఏడాది దాటినప్పటికీ మందపల్లి నిర్వాసిత గ్రామంలో ఇసుకదిబ్బలు తోయడం మినహా ఇసుక దిబ్బల తరలింపు, భూముల సరిహద్దుల ఏర్పాటు వంటి పునరుద్ధరణ పనులు చేపట్టలేదు. వరద ప్రవాహం బారిన పడిన గ్రామాల్లో ఒకటైన పులపుత్తూరు పొలాల్లో నేటికీ ఇసుకమేటలు



తొలగింపునకు నోచుకోవడం లేదని ఉప సర్పంచ్ కృష్ణరాజు దగ్గర నుంచి నిర్వాసితుల్లో ఎవరిని కదిలించినా కళ్లలో కన్నీరు సుడులు తిరుగుతున్నాయి. ఈ నెల 19వ తేదీతో వరదవిపత్తు ఏడాదిలోకి అడుగుపెడుతున్నప్పటికీ ఇసుకమేటలు తొలగింపు చేపట్టకపోవడం, నూతన పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయకపోవడం, పోషకాల సంబంధించి ఉపాధి హామీ వంటి పనులు కల్పించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. పంటల సాగుకు అవసరమైన పెట్టుబడులకు ఇబ్బందులు తలెత్తుతుండడంతో ఏమీ చేయలేని నిస్సహాయ పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

వెయ్యి ఎకరాల్లో పంట నష్టం?

అన్నమయ్య నిర్వాసిత గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో పంటలు సాగు ప్రశ్నార్థకంగా మారింది. 927 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. ఏడాది సమయం గడిచినప్పటికీ పునరుద్ధరణ పనులు చేపట్టకపోవడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. మొదటగా మందపల్లి, శేషమాంబపురం గ్రామాల్లో 150 ఎకరాల పొలాలు కోతకు గురి కావడం, మరో 370 ఎకరాల్లో ఇసుక మేటలు వెరసి 520 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. గుండ్లూరులో 50 ఎకరాల్లోని పొలాలు కోతకు గురికావడం, 95 ఎకరాల్లో ఇసుక మేటలు వెరసి 158 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లడం గమనార్హం. పులపుత్తూరులో 100 ఎకరాల్లో పంట కోతకు గురికావడం, మరో 150 ఎకరాల్లో వెరసి 250 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లడం ఆందోళన కలిగిస్తోంది. గుండ్లూరులో 220 ఎకరాల్లో పంటలు సాగు చేసేశారు. వరద విలయం దాటికి పొలాల మృత్తికా స్వరూపం మారిపోవడంతో సాగుకు యోగ్యం కాని పరిస్థితి ఏర్పడిందని నిర్వాసిత గ్రామాల రైతులు వాపోతున్నారు. పులపుత్తూరు నిర్వాసిత గ్రామానికి చెందిన నిర్వాసితుడు బియ్యపు శంకర్‌రెడ్డి మాట్లాడుతూ తమ గ్రామంలోని నిర్వాసితులకు ఉపాధి హామీ పథకం పనులు అమలు చేయకపోవడంతో దళిత సామాజిక వర్గం మొదలుకుని ఇతర సామాజిక వర్గాల్లో తీవ్ర నిర్వేదం నెలకొందని పేర్కొనడం నిర్వాసితుల దుర్భర పరిస్థితి అద్దం పడుతోంది.

'రాజకీయం' గుప్పిట్లో నిర్వాసితులు

అన్నమయ్య నిర్వాసితులు తమ పరిస్థితులపై గొంతెత్తే ఇబ్బందులు తప్పడం లేదని తెలుస్తోంది. ఇద్దరు ప్రజా ప్రతినిధుల గ్రూపుల్లో చేరి ఇబ్బందులు పెడుతున్న కారణంగా ఎవరికి చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడిందని మదనపడుతున్నామని పలువురు నిర్వాసితులు పేర్కొంటున్నారు. నోరు విప్పితే గ్రూపుల మధ్య ముద్ర పడుతుందని, బయటికి చెప్పడానికి జంకుతున్నామని సుబ్బమ్మ అనే నిర్వాసితురాలు పేర్కొనడం గమనార్హం. దాతలు వేసిన రేకుల షెడ్లలో కరెంటు షాక్ కొడుతోందని, తమ పిల్లలు పట్టుకుంటే పరిస్థితి తేడాని వాపోతున్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యారని మరో మహిళ వాపోతుండడం గమనార్హం. ఏడాది గడిచినప్పటికీ కొనసాగుతున్న దుర్భర పరిస్థితుల నేపథ్యంలో కలెక్టర్ జోక్యం చేసుకుని తక్షణం ఉపాధి హామీ పనులు కల్పించడం, పొలాల్లో తిష్ట వేసిన ఇసుక దిబ్బలను తొలగించడం, భూముల సరిహద్దులు రూపు మాసిన నేపథ్యంలో సర్వేయర్లతో కొలతలు వేయించి సాగును ప్రోత్సహించాల్సి ఉంది. దీనిపై అన్నమయ్య జిల్లా వ్యవసాయాధికారిని సంప్రదించగా తాను అందుబాటులో లేనని పేర్కొనడం గమనార్హం.

అభివృద్ధి పరుగులు పెడ్తోంది

నిలకడ లేని మనిషి పవన్‌కల్యాణ్
టిడిపి విష ప్రచారాన్ని నమ్మొద్దు
పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా



బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి రోజా

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని 26 జిల్లాల్లో సంక్షేమం- అభివృద్ధి పరుగులు పెడ్తోందని పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. ప్రొద్దుటూరు శివాలయం ఎదురుగా రూ.53కోట్లతో అధునాతనంగా నిర్మించనున్న కూరగాయల మార్కెట్‌కు మంత్రి మంగళవారం భూమిపూజ చేశారు. మంత్రితో పాటు ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, స్థానిక ఎంఎల్‌ఎ రాచమల్లు ప్రసాదరెడ్డి హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి రోజా మాట్లాడుతూ 2.38 ఎకరాలలో నిర్మిస్తున్న ఆధునీకరణ మార్కెట్ రాయలసీమలో ఎక్కడా లేని సౌకర్యాలుంటాయని చెప్పారు. ఏడాది లోగా మార్కెట్‌ను నిర్మిస్తామన్నారు. జగనకు ఎంఎల్‌ఎ రాచమల్లు ప్రసాదరెడ్డి వీరభక్తుడన్నారు. వై.ఎస్. కుటుంబం పట్ల విధేయత, ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి ఈ రెండే ధ్యేయంగా రాచమల్లు పనిచేస్తున్నారన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ నిలకడలేని మనిషి అన్నారు. ఒకసారి ప్రధాని మోడీ చంకనెక్కారని ఇప్పుడు చంద్రబాబు చంకనెక్కారని ఎద్దేవా చేశారు. పప్పులాంటి లోకేష్ వల్ల ఏమికాదని జగన్‌లాంటి కొడుకును ఎందుకు కనలేదని చంద్రబాబు బాధపడుతున్నారని పేర్కొన్నారు. టిడిపి విషప్రచారాన్ని నమ్మొద్దు అన్నారు. సలహాదారు సజ్జల మాట్లాడుతూ ప్రొద్దుటూరు కూరగాయల మార్కెట్‌ను చూస్తే ఇరువురు నాయకుల మధ్య ఉన్న తేడా తెలిసిపోతోందన్నారు. సంక్షేమ ఫలాల లబ్ధిదారులే వైసిపికి ప్రచార కార్యకర్తలన్నారు. 2024 ఎన్నికల్లో 175కు 175 సీట్లు వైసిపికి దక్కడం ఖాయమని జోస్యం చెప్పారు. అంతకు ముందు రాచమల్లు ప్రసాదరెడ్డి మాట్లాడుతూ శ్రీశైలంలో నీరు ఉన్నంతవరకు ప్రొద్దుటూరుకు మంచినీటి సమస్య ఉండదంతగా పనులు చేశామన్నారు. ఇంకా అభివృద్ధి జరగాలంటే మళ్లీ జగనే రావాలని ఆయన కోరారు. **కృష్ణ మృతి బాధాకరం** .. సినీ నటుడు సూపర్ స్టార్ కృష్ణ మృతి బాధాకరమని మంత్రి రోజా ఆవేదన వ్యక్తం చేశారు. కూరగాయల మార్కెట్ భూమిపూజ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన ప్రొద్దుటూరుకు వచ్చారు. ఇదేరోజు తెల్లవారుఝామున కృష్ణ మృతి చెందడంతో రోజా తన ఆవేదనను వ్యక్తం చేశారు. కృష్ణ మృతితో తెలుగుసినీ రంగం పెద్దదిక్కును కోల్పోయిందన్నారు.

ప్రాధాన్యతా రంగాలు పటిష్టం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అన్ని ప్రాధాన్యతా రంగాలను మరింత పటిష్టం చేసి జిల్లాను ప్రగతి పథంలో నడిపించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని స్పందన హాలులో సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ పరిధిలో జిల్లాలో విస్తృత సాగుబడిని పెంచడంతో పాటు అధిక దిగుబడులను సాధించేలా.. యాజమాన్య పద్ధతులను రైతులు పాటించేలా అవగాహన పెంచా లన్నారు. ఆయా వ్యవసాయ, ఉద్యాన పంటలకు అవసరమైన సూక్ష్మ పోషక, ఖనిజ దాతువులను క్రమపద్ధతి ప్రకారం అందించేలా రైతులకు అవగాహనా పెంచాలని సూచించారు.. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలోని ఆర్‌బికెల ద్వారా.. వ్యవసాయ, ఉద్యాన రంగ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశుసంవర్ధక శాఖలో వైద్యులు మరింత విస్తృతం చేస్తూ పాడి పరిశ్రమ, పౌల్ట్రీ, గొర్రెలు, మేకల పెంపకందార్లను ఆర్థికంగా ముందుకు నడిపే సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ పథకాల లక్ష్య సాధన కోసం చిత్తశుద్ధితో ముందుకు సాగాలన్నారు. జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా బ్యాంకు అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు, హార్టికల్చర్ జిల్లా అధికారి మైకేల్ రాజీవ్, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డా.శారదా, ఎపిఎంఐపి పీడీ రవీంద్రారెడ్డి, మార్కెటింగ్ శాఖ ఏడీ హిమశైల, డిసిఓ సుభాషిణి, ఎల్డిఎం దుర్గాప్రసాద్, వివిధ ప్రాధాన్యత రంగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

'కత్తి'కి 'ఐటా' సంపూర్ణ మద్దతు

కడప అర్బన్ : విద్య,ఉపాధ్యాయ సమస్యలపై ఎనలేని కృషి చేస్తున్న కత్తి నరసింహారెడ్డికి ఐటా రాష్ట్ర శాఖ పక్షాన సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నామని రాష్ట్ర అధ్యక్షులు ఎస్.అబ్దుల్ రజాక్ పేర్కొన్నారు. మంగళవారం ఐటా జిల్లా కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, ఉపాధ్యాయ రంగాలపై తీసుకుంటున్న విధాన పరమైన నిర్ణయాలు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇలాంటి సమయంలో శాసన మండలిలో ప్రభుత్వ విధానలపై ప్రశ్నించి, పోరాటం చేస్తున్న ఉద్యమ నేత కత్తి నరసింహారెడ్డి లాంటి నాయకత్వం ప్రతి ఉపాధ్యాయుడు కోరుకుం టున్నారని చెప్పారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి ఎమ్మెల్సీ మాట్లాడుతూ తాను విద్యార్థి దశ నుంచి ఉపాధ్యాయుడిగా, ఉపాధ్యాయనేతగా విద్య ,ఉపాధ్యాయ హక్కుల కోసం అనునిత్యం పోరాడుతున్నానని తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై ఆందోళన


కడప అర్బన్ : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆందోళన నిర్వహిస్తామని ఎన్ఎంయు కడప డిపో అధ్యక్షులు శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం కడప యూనియన్ కార్యాలయంలో కడప రీజియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 డిపోలలో ఉన్న ఉద్యోగుల సమస్యలపై త్వరలో కడప రీజియన్ వ్యా ప్తంగా ఆందోళనలు చేపట్టేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సభాధ్యక్షులు కడప రీజియన్ ప్రెసిడెంట్ నాగముని, రాష్ట్ర నాయకులు శివా రెడ్డి.జోనల్ నాయకులు చెన్నారెడ్డి,కడప రీజినల్ కార్యదర్శి సుధాకర్,అన్ని డిపోల అధ్యక్ష కార్యదర్శులుగ్యారేజ్ కార్యదర్శి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసులు

కార్పొరేటర్‌ను సన్మానించిన సంఘ సేవకులు

కడప అర్బన్ : ఖాన్ బహదూర్ హకీమ్ మంజు మియా పార్క్ పునః నిర్మాణం కోసం కౌన్సిల్ సమా వేశంలో ప్రస్తావన తీసుకొచ్చి నిధులు మంజూరు చేయించిన 30వ డివిజన్ కార్పొరేటర్ షఫీని సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ సర్కిల్ నుంచి 7రోడ్ల వరకు ఉన్న రోడ్డును మంజుమియా రోడ్డుగా నామకరణం చేయాలని కోరారు. కార్పొరేటర్ స్పందిస్తూ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, మేయర్ సురేష్ బాబు, కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



షఫీని సన్మానిస్తున్నసలావుద్దీన్

సిపిఎస్‌ను రద్దు చేయాలి : యుటిఎఫ్


కడప అర్బన్ : ఉద్యోగ ఉపాధ్యాయులకు భరోసా లేని పెన్షన్ విధానమైన సిపిఎస్ దుష్పరిణామాలు, జిపిఎస్ అమలు చేస్తే కలిగే నష్టాలు, ఎపిఎస్‌కు ప్రత్యామ్నాయమైన పెన్షన్ లేదని తెలిపే కరపత్రాలు యుటిఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. మంగళవారం యుటిఎఫ్ భవన్‌లో రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి తన పాదయాత్రలో అడుగడుగునా సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ప్రగల్భాలు పలికి నేడు అధికారం చేపట్టాక అవగాహన లేక హామీ ఇచ్చామని చెప్పడం దారుణమన్నారు. ఒపిఎస్ విధానం కన్నా మెరుగైన జిపిఎస్ విధానాన్ని ప్రవేశపెడతామని చెప్పడం ఉద్యోగ, ఉపాధ్యాయులను వంచన చేయడమే అన్నారు. ప్రతి సిపిఎస్ ఉద్యోగికీ కరపత్రాన్ని చదివి మీ భవిష్యత్తుకు భరోసా కల్పించే పాత పెన్షన్ విధానం సాధించుకోవడానికి, ఉద్యమ బాట పట్టడానికి సంసిద్ధులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్ కుమార్, పాలెం మహేష్ బాబు, జిల్లా ట్రెజరర్ నరసి ంహారావు, కార్యదర్శి దావుద్దీన్, సిపిఎస్ జిల్లా కన్వీనర్ చిట్టిపోయిన సుదర్శన్, కో కన్వీనర్ కిరణ్ కుమార్, పాల్గొన్నారు.

తరాల్ విద్యా సామగ్రి పంపిణీ

చింతకొమ్మదిన్నె : తరాల్ విద్యా సామగ్రి ఆయా పాఠశాలకు పంపిణీ చేశామని మండల విద్యాశాఖ అధికారి వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంఆర్‌సి భవనంలో విద్యాసామగ్రిని ఆయా పాఠశాలలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు, నాలుగు, ఐదు తరగతులకు బోధించే ఉపాధ్యాయులకు గతంలోనే శిక్షణ ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు విద్యార్థులకు సులభతర రీతిలో అర్థం చేసుకునేందుకు విద్యార్థులకు దాదాపు 21 రకాల ఉపకరణాలను పాఠశాలలకు అందజేశామని చెప్పారు.

వైద్య విద్యార్థికి చేయూత

కడప సిటీ :కర్నూలుకు చెందిన నాగరాజు అనే పేద విద్యార్థికి రిమ్స్ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు వచ్చింది. ఫీజు కట్టే స్తోమత లేకపోవడంతో తేజస్వి ఛారిటబుల్ ట్రస్ట్ మహేశ్వర్‌రెడ్డిని సంప్రదించగా ఆయన వెంటనే స్పందించి ఖాజీపేట మండలం రావులపాలెం సర్పంచి శివరామరెడ్డిచే ఫీజుకు అవసరమైన రూ.23,500 మొత్తాన్ని మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఎం.శ్రీనివాస్ నాయక్, డాక్టర్ సాగర్, కుళ్ళాయి రెడ్డి, డాక్టర్ లక్ష్మి నారాయణ, మంగమ్మ పాల్గొన్నారు.



విద్యార్థికి ఆర్థిక సాయం చేస్తున్న దాతలు

దళారీ వ్యవస్థను అరికట్టేందుకే సహకార మార్కెటింగ్

కడప అర్బన్ :దళారీ వ్యవస్థను అరికట్టేందుకే సహకార మార్కెటింగ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని సహకార శిక్షణా కేంద్రం డిప్యూటీ రిజిస్టర్ గుర్రప్ప అన్నారు. మంగళవారం 69వ అఖిల భారత సహకార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్క్ ఫెడ్, ఎపి సీడ్స్ సహకారంతో మార్కెటింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వరి ధాన్య సేకరణ 38 క్వింటాళ్లు, శెనగలు 56 వేల క్వింటాళ్లు మార్కెటింగ్ చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ చంద్ర లీల డిసిఎంఎస్ బిజినెస్ మేనేజర్ ఖాదరవల్లి, సిబ్బంది పాల్గొన్నారు.

డిసెంబర్‌లో పాదయాత్ర

కడప అర్బన్ : జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుకై డిసెంబరు 9 నుంచి 13 వరకు జమ్మలమడుగు కన్యతీర్థం శిలాఫలకం నుంచి కడప కలెక్టరేట్ వరకు సిపిఐ నేతృత్వంలో పాదయాత్ర చేపడుతున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర పేర్కొన్నారు. మంగళవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిలాఫలకం నుంచి జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, చెన్నూరు మీదుగా కడప కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న గ్రంథాలయ చైర్‌పర్సన్ ఉషారాణి

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్ర భాండాగారాలని గ్రంథాలయ చైర్పర్సన్ లింగాల ఉషారాణి అన్నారు. మంగళవారం గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా జై నగర్ కాలనీలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషారాణి, సమగ్ర శిక్ష జిల్లా పథకఅధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి ప్రసంగించారు. పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి వారోత్సవాల ముగింపు రోజు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ మహమ్మద్ ఆజాద్, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి అమీరుద్దీన్, ప్రధానోపాధ్యాయులు భాగ్యవతి, జనవిజ్ఞాన వేదిక సభ్యులు దేవాదతం, మేరీ, సిఆర్పిలు, ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. **చెన్నూరులో..** స్థానిక శాఖా గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక సహకార బ్యాంకు మేనేజర్ గంగిరెడ్డి జవహర్‌లాల్‌నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళించారు. మంగళవారం స్వాతంత్ర్య ఉద్యమ నాయకుల పుస్తకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, విజేత మహిళా మండలి నిర్వాహకురాలు జి.అరుణకుమారి, గ్రంథాలయ అధికారి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



చెన్నూరు గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

18 నుంచి 'ప్రైమ్'లో వినాయక ఆస్పత్రి సేవలు

ప్రజాశక్తి-కడప సిటీ



నగరంలోని డిసిసి బ్యాంక్ ఎదురుగా ఉన్న శ్రీవినాయక ఆస్పత్రి సేవలు ఈనెల 18 నుంచి ఎర్రముక్కపల్లెలోని జార్జిరెడ్డివీధిలో కొమ్మా ఆస్పత్రి వద్దనున్న ప్రైమ్ ఆస్పత్రిలో కొనసాగుతాయని డాక్టర్ ప్రతాప్ పేర్కొన్నారు. అదేరోజు ప్రైమ్ ఆస్పత్రిలోనే వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని తెలిపారు. వైద్య శిబిరంలో కన్సల్టేషన్ ఫీజు పూర్తిగా ఉచితమని, షుగర్, బిపి, థైరాయిడ్, ఎముకల సాంద్రత పరీక్షలు రూ.50 లకు, నరాల పటుత్వ, ఊపిరితిత్తుల పిఎఫ్‌టి పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. రిజిస్ట్రేషన్ కోసం 9553966918,7815864548లలో సంప్రదించాలన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి - కడప

తమ నివాసాల చుట్టు ఉన్న పరిసర ప్రాంతాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే పర్యావరణాన్ని పరిరక్షించుకుని వ్యాధుల భారిన పడకుండా ఆరోగ్యంగా, స్వేచ్ఛగా జీవిస్తారని ఆశ రేఖ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు నెమలిదిన్నె నాగవేణి ప్రజలకు సూచించారు. మంగళవారం స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా ఆశ రేఖ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని రవీంద్రనరగ్, మురాదీ వీధుల్లో పర్యటించి ప్రజలకు పారిశుధ్య అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలు

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి కడప అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హమాలీ కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఎపి ఎస్‌బిసిఎల్‌ఐఎంఎఫ్ డిపో హమాలీ యూనియన్ రాష్ట్ర 4వ మహాసభలు నిర్వహించారు. ముందుగా మహాసభల జెండాను ఆవిష్కరించారు. అనంతరం మృతి చెందిన కార్మికులకు, ప్రముఖులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అన్ని రకాల ధరలు పెరిగిపోయిన నేపథ్యంలో హమాలీ కార్మికులకు ఎగుమతి దిగుమతి కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. హెల్త్ ఇన్సూరెన్స్, ఇఎస్ఐ, పిఎఫ్, పింఛను హమాలీలకు ఇస్తామని ఇంతవరకు ఇవ్వలేదని పేర్కొన్నారు. కరోనాకాలంలో ముఠా కార్మికులను ప్రభుత్వాలు విస్మరించాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఠా కార్మికులను కలుపుకొని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకుంటామని పేర్కొన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. అసంఘటిత కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని చెప్పారు. మహాసభల్లో భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుబ్బారెడ్డి, కొండలరావు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం వచ్చాక నూతన మద్యం పాలసీ తీసుకువచ్చారని చెప్పారు. ఎన్నికలలో మధ్య నిషేధం అమలు చేస్తే హమాలీ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగాలు చూపించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 2,100 మంది పనిచేస్తున్నారని, వారందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సభలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్ రావు, నాయకులు నూరు మొహమ్మద్, సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె. శ్రీనివాసులు రెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, నాయకులు సుంకర రవి, రాష్ట్ర వ్యాప్తంగా హమాలీ కార్మికులు పాల్గొన్నారు. ఎగుమతి కూలీల రేట్ల పెంపు కోసం ఐక్య ఉద్యమాలు చేపట్టాలని, యూనిఫామ్, బీమా, పెండింగ్ సమస్యల పరిష్కారానికి హమాలీలందరినీ కలుపుకొని పోరాటాలు చేయాలి అని తీర్మానించారు.



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రభుత్వ స్టేడియాలను కాపాడాలి : డివైఎఫ్ఐ

కడప అర్బన్ :రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ స్టేడియాలను పేఅండ్ ప్లే పేరుతో ప్రయివేట్ కాంట్రాక్టర్లకు లీజుకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల.శివకుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్టు ఇచ్చేందుకు టెండర్లు కూడా అధికారులు ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులను సైతం ప్రయివేట్ వ్యక్తులకు ఇచ్చేందుకు టెండర్ పిలిచారని పేర్కొన్నారు. షటిల్ బ్యాట్మెంటన్ కోర్టులను ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చేందుకు టెండర్ నోటిఫికేషన్ కూడా జారీ చేశారని చెప్పారు.దీనిని జిల్లా క్రీడాకారులు, క్రీడా అభిమానులు తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. సమావేశంలో నగర అధ్యక్ష,కార్యదర్శులు షకీర్, డి.ఎం. ఓబులేసు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

కడప అర్బన్ :వైఎస్ఆర్ జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులుగా పని చేసేందుకు ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అదనపు కో-ఆర్డినేటర్ డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అకడమిక్ మానటరింగ్ ఆఫీసర్, గర్ల్స్ చైల్డ్ డెవలప్ మెంట్ ఆఫీసర్, ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్, పోస్టులను భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పని చేసే ప్రధానోపాధ్యాయులు, ఎంఇఒ లేదా డైట్ లెక్చరర్లు, స్కూల్ అసిస్టెంట్స్ ఈ పోస్టులకు అర్హులన్నారు. ఈనెల 21 నాటికి దరఖాస్తుదారుల వయస్సు 50 ఏళ్ల లోపు ఉండాలన్నారు. ఆసక్తిగల వారు ఈ నెల 21 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కడప : గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ మహిళలు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కెనరా బ్యాంక్ గ్రామీణ ఉపాధి శిక్షణా సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్‌లో 30 రోజులు, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్‌లో 30 రోజులు, జ్యూట్ బ్యాగ్స్ తయారీ కోర్సులో 13 రోజుల పాటూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ మహిళకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

సమానత్వం సాధించాలి

కడప : జిల్లాలో బాలికల నిష్పత్తి గణనీయంగా తగ్గిపోతుందని, సమానత్వం సాధించాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి (ఇన్‌ఛార్జి) పి.ఆర్.సునీత రాజు అన్నారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగ ఆధ్వర్యంలో బేటీ బదావో, బేటీ పడావో ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం మంగళవారం టిటిడిసిలో జిల్లా, మండల సమాఖ్య అధ్యక్షులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి కాన్పులోనే ఆడపిల్లకు జన్మనిచ్చిన వారిని గుర్తించి వారికి, వారి కుటుంబ సభ్యులకు డ్వాక్రా సంఘాల సమావేశాలలో అవగాహన కల్పించాలన్నారు.

'బుద్ధ టౌన్‌షిప్‌పై విచారించాలి

కడప : వైఎస్ఆర్ జిల్లాలోని చింతకొమ్మదిన్నె మండలంలో అనుమతులు లేని బుద్ధ టౌన్‌షిప్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై వెంటనే విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎ.సత్తార్ ఆధ్వర్యంలో కలెక్టర్ విజయ్‌రామరాజును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్తార్ మాట్లాడుతూ సర్వే నెంబరు 692/1, 692/2, 716, 718/1,2, 719, 720/1,2లలోని భూమిని బుఖారియా ఎడ్యుకేషనల్ సొసైటీకి మెడికల్ కళాశాల నిర్మాణం కోసం కేటాయించాలని కలెక్టర్‌ను 2000 సంవత్సరంలో అప్పీలు చేసుకున్నారన్నారు. సదరు భూమిని బుఖారియా ఎడ్యుకేషనల్ సొసైటీ వారికి ఇవ్వడం సాధ్యం కాదని తెలిపారు. అన్ని సక్రమంగా జరిగినట్లు ప్రచారం చేసుకుని 50 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని అక్రమ పద్ధతిలో స్వాధీనం చేసుకుని రోడ్లు, కాలువలు అన్ని వేసి ప్రభుత్వ భూమిలో వెంచర్ వేస్తున్నారని తెలిపారు విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

అభివృద్ధి పనులపై మేయర్ సమీక్ష

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరపాలక సంస్థ మేయర్‌ఛాంబర్‌లో స్టాండింగ్ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. నగర అభివృద్ధి పనులు, పారిశుధ్యం, సుందరీకరీకరణ, రోడ్డు వెడల్పులు పలు అంశాలపై నగర మేయర్ సురేష్ బాబు సమీక్షించారు. కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్, స్టాండింగ్ కమిటీ సభ్యులు, అధికారులతో చర్చించారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు సుబ్బారెడ్డి, శిరీష, మేసా ప్రమీలా రాణి, షఫీ, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, ఎంఇ నారాయణస్వామి, రెవెన్యూ ఆర్ఒలుకన్నయ్య, డిసిపి కుమార్ ఎసిపి నాగేంద్ర, డిఇలు వేణుగోపాల్, , అబిద్ హుస్సేన్, ఎంహెచ్ఒ ప్రశాంత్ వర్ధన్, సీనియర్ అసిస్టెంట్లు విశ్వనాథరెడ్డి, శివకుమార్, ఎటిఒ అంజిని కుమారి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని పరామర్శించిన సజ్జల

ప్రజాశక్తి - చాపాడు


ఎమ్మెల్యేను పరామర్శిస్తున్న సజ్జల, ఎంపీ, నాయకులు

మైదుకూరు శాసనసభ్యులు ఎస్. రఘురామిరెడ్డిని మంగళవారం ప్రొద్దుటూరులోని ఆయన స్వగృహంలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పరామర్శించారు. ఎమ్మెల్యే ఇటీవల మోకాలు శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చారు. కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు ఎమ్మెల్యేను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా, స్కిల్ డెవలప్మెంట్ మాజీ చైర్మన్ ప్రస్తుత సలహాదారు చల్లా మధుసూదన్‌రెడ్డి వైసిపి నాయకులు సోషల్ వెల్ఫేర్ చైర్మన్ పులి సునీల్‌కుమార్, హ్యాండీక్రాఫ్ట్ చైర్మన్ విజయలక్ష్మి, అడా చైర్మన్ గురుమోహన్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వేల్పుల రాము, కొండయ్య మాధవరెడ్డి, ఎల్లారెడ్డి, శంకర్ రెడ్డి, జయచంద్రారెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

నేడు మైలవరం మండల సమావేశం

ప్రజాశక్తి - మైలవరం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ రామచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశాన్ని ఎంపిపి సావిత్రమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేశామన్నారు. సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు సమావేశానికి తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

మాట తప్పడం.. మడమ తిప్పడం జగన్ దినచర్య

ప్రజాశక్తి - వేంపల్లె


మాట్లాడుతున్న ఎన్.తులసిరెడ్డి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాట తప్పడం.. మడమ తిప్పడం దిన చర్యగా మారిందని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జమ్మల మడుగు నియోజకవర్గంలోని సున్నపు రాళ్ల గ్రామ సమీపంలో 3200 ఎకరాల్లో వైఎస్సార్ స్టీల్ లిమిటెడ్ పేరుతో ఉక్కు కర్మాగారానికి సిఎం హోదాలో జగన్ శంకుస్థాపన చేశారన్నారు. రూ.25 వేల కోట్లు ఖర్చు చేసి ఏడాదికి 30 లక్షల టన్నుల సామర్థ్యంతో మూడేళ్లల్లో పూర్తి చేసి ప్లాంట్లును ప్రారంభించి, 15 వేల మందికి ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామని ఆ రోజు చెప్పారన్నారు. ఆ గడువు పూర్తయినప్పటికీ అతీగతీ లేదన్నారు. రహదారి, ప్రహరీ పూర్తి కాలేదన్నారు. మాట మీద నిలబడ్డాలని ఆయన జగన్‌కు సూచించారు. సూపర్‌స్టార్ కృష్ణ మృతి మతి బాధాకరమన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కృష్ణ కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

సూపర్‌స్టార్ కృష్ణ మృతి బాధాకరం

ప్రజాశక్తి - ఖాజీపేట

సూపర్‌స్టార్ కృష్ణ మృతి బాధాకరమని టిడిపి రాష్ట్ర సీనియర్ నాయకులు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దుంపలగట్టు గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ హీరో కృష్ణ నిర్మాతగా, దర్శకుడిగా, స్టూడియో అధినేతగా ప్రతిభ చూపారన్నారు. ఏలూరు ఎంపీగా ప్రజాసేవ చేశారన్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అని కృష్ణను కొనియాడారు. ఆస్ట్రేలియా ప్రభుత్వం కృష్ణ పోస్టల్ స్టాంపును విడుదల చేయడం గొప్ప విషయమన్నారు. 80ఏళ్ల మచ్చలేని మహారాజుగా ప్రజా హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఆయనకు ఆయనే సాటి అన్నారు.

సర్వేయర్ పోస్టును భర్తీ చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - మైలవరం

సర్వేయర్ పోస్టును వెంటనే భర్తీ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు జి.డేవిడ్‌రాజ్ డిమాండ్ చేశారు. ఆ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయంలో సర్వేయర్ పోస్టు ఖాళీగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భూ సమస్యలు పరిష్కారం కాక రైతులు అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు రాఘవేంద్ర, రాజు పాల్గొన్నారు .

మంత్రి రోజాను కలిసిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల


రోజాను కలిసిన తుంగా, నాగిరెడ్డి

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె రోజాను ప్రొద్దుటూరులో మంగళవారం ఎర్రగుంట్ల 5వ, 6వ వార్డు కౌన్సిలర్లు తుంగా వెంకటరామిరెడ్డి, నాగిరెడ్డి కలిశారు. ప్రొద్దుటూరులో మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన కోసం రోజా వచ్చారు. ముందుగా వారు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిశారు.

భవిత కేంద్రంలో వాటర్ బెడ్ వితరణ

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : స్థానిక హౌసింగ్ బోర్డులో ఉన్న భవిత కేంద్రంలో ఆయాగా విధులు నిర్వహిస్తున్న అంజలి కుమారుడు వినయ్ అనే విభిన్న ప్రతిభావంతుడైన బాలుడికి ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ తన మిత్రుడు డికె సుధీర్ సాయంతో వాటర్ బెడ్ అందజేశారు. వాటర్ బెడ్ అవసరమని అంజలి ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థను సంప్రదించారు. కార్యక్రమంలో భవిత కేంద్రం నిర్వాహకురాలు సంగీత, సేవా సంస్థ సభ్యులు సాయి, మాధవ పాల్గొన్నారు.


వాటర్ బెడ్ వితరణ చేస్తున్న సభ్యులు

ఛాంపియన్‌కు అభినందన

ప్రజాశక్తి - కడప

బాడీ బిల్డింగ్ పోటీలలో ఛాంపియన్‌గా నిలిచిన లెజెండ్ జిమ్ కు చెందిన షేక్ నయీమ్‌ను మంగళవారం ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. కడప బాడీబిల్డర్స్ అసోసియేషన్ వ్యయ ప్రయాసల కోర్చి ఎంతో ఘనంగా ఉభయ జిల్లాల బాడీ బిల్డింగ్ పోటీలను నిర్వహించడం సంతోషకరమని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు.. అసోసియేషన్ భవిష్యత్తులో నిర్వహించే రాష్ట్ర, జాతీయ పోటీలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అహమ్మద్ బాషా, కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు షేక్ షఫీ, లెజెండ్ జిమ్ అధినేత, అసోసియేషన్ ఉపాధ్యక్షులు రషీద్, వైసీపీ నాయకులు సుభాన్‌బాషా పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి-పోరుమామిళ్ల రూరల్

స్థానిక శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు రక్తనిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా' రైట్‌టైమ్‌లో రైట్ హ్యాండ్ అందిస్తాం' సొసైటీ నిర్వాహకులు పురం ప్రసాద్, నాయబ్‌రసూలు మాట్లాడుతూ రక్తనిర్ధారణ పరీక్షల్లో 300 మందికి నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఓబుల్‌రెడ్డి, కరస్పాండెంట్లు రామిరెడ్డి, పిచ్చిరెడ్డి, ఫౌండేషన్ సభ్యులు మణికంఠ, ల్యాబ్ టెక్నీషియన్లు మణికంఠ, సుందర్, ఇస్లామ్ పాల్గొన్నారు.

ప్రమాదకర మలుపులు.. వాహనదారులకు ఇక్కట్లు

ప్రజాశక్తి - ముద్దనూరు


ఉప్పలూరుకు వెళ్లే దారిలో ప్రమాదకరంగా ఉన్న మలుపు

మండలంలోని వేల్పుచెర్ల ఉప్పలూరు గ్రామానికి వెళ్లే దారిలో ప్రమాదకర మలుపులతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఈ మలుపుల్లో రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు పెరిగి రోడ్డు కనబడడంలేదని వారు వాపోతున్నారు. ఉప్పలూరు చుట్టు పక్కల గ్రామాలకు కేంద్రంగా ఉంది. ఈ ప్రాంతం ఉద్యాన పంటలకు ప్రసిద్ధి. ఈ దారిలో నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఉప్పలూరు, కొలవలి, మాదన్నగారిపల్లె గ్రామ పంచాయతీల్లోని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఉప్పలూరు కేంద్రంగా వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. ఉప్పలూరు నుంచి వేల్పుచెర్ల మీదుగా ముద్దనూరుకు ఆటోలు, బైకులు, ట్రాక్టర్లు, కూరగాయలు ఎగుమతి కోసం లారీలు, వ్యాన్లు తిరుగుతుంటాయి. ఈ దారిలో పలుమార్లు ప్రమాదాలు చోటు చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. ఈ మార్గంలో ఉన్న మలుపుల్లో ఆర్అండ్‌బి అధికారులు రహదారులను సూచించే సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. సంబంధిత ఆర్అండ్‌బి, గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణాపాయం జరగకముందే సంబంధిత అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేసి కంపచెట్లు తొలగించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

అభివృద్ధికి సహకరించండి : జడ్‌పి సిఇఒ


మాట్లాడుతున్న జడ్‌పి సిఇఒ సుధాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రోడ్డు విస్తరణలో జడ్‌పి వాణిజ్య గదులను కొద్దిమేర తొలగించాల్సిన అవసరం ఉందని, వ్యాపారులు గదులను ఖాళీ చేసి అభివృద్ధికి సహకరించాలని జడ్‌పి సిఇఒ సుధాకర్‌రెడ్డి, జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రి కోరారు. స్థానిక మండల పరిషత్ సభాభవనంలో మంగళవారం జడ్‌పి వాణిజ్య గదుల్లో ఉన్న వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భాగంగా కొంత గదులను తొలగించి, మళ్లీ మరమ్మతులు చేసి ఇప్పుడున్న వారికే ఆ గదులను కేటాయిస్తామని పేర్కొన్నారు. రోడ్డు ముందు భాగంలో ఉన్న 19 వాణిజ్య గదులకు అందరూ ఒకే బాడుగను వ్యాపారులు చెల్లించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలను అంగీకరిస్తే ప్రస్తుతం ఉన్న వ్యాపారస్తులకే గదులను ఇస్తామన్నారు. రెండేళ్లపాటు కరోనాతో వ్యాపారం లేక చాల ఇబ్బందులు పడ్డారని గౌడ్ సంఘం జిల్లా అధ్యక్షులు రవిశంకర్, మాజీ సర్పంచు నాగసుబ్బారెడ్డి అధికారుల దృష్టికి తెచ్చారు. వ్యాపారులకు ఇబ్బందుల్లేకుండా బాడుగలు పెంచాలని వారు కోరారు. ఇందుకు జడ్‌పి సిఇఒ సానుకూలంగా స్పందించారు. ఒక్కో గది 20 అడుగులు పొడవు ఉండేలా ప్రణాళికలు వేసి మరమ్మతులు చేసి ఇస్తామని జడ్‌పిటిసి తెలిపారు. వెనుక వైపు ఉన్న గదులకు సంబంధించి తర్వాత వ్యాపారులతో చర్చించనున్నట్లు తెలిపారు. అధికారులకు సహకరించాలని జడ్‌పిటిసి కోరారు. సమావేశంలో డిప్యూటీ సిఇఒ రమణారెడ్డి, ఎంపిడిఒ మల్లికార్జున రెడ్డి, వాణిజ్య గదుల్లోని వ్యాపారస్తులు పాల్గొన్నారు.

నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించొచ్చు

గాయపడిన వారికి సాయం చేయండి : డిటిసి మీరా ప్రసాద్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్


మాట్లాడుతున్న డిటిసి మీరా ప్రసాద్

రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ వెళితే ప్రమాదాలను చాలావరకు నివారించొచ్చని జిల్లా రవాణా శాఖ కమిషనర్ మీరా ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఎంవిఐ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మీరా ప్రసాద్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో గాయపడినవారిని ఆ ప్రాంతవాసులు రక్షించేందుకు ముందుకు రావాలన్నారు. ప్రమాదం జరిగిన గంటలోపు గాయపడిన వారిని మనం రక్షించడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. హాస్పిటల్‌కు తీసుకువెళ్లిన తర్వాత మిమ్మల్ని ఎవరు ప్రశ్నించరని, పోలీస్‌స్టేషన్‌కు రమ్మని ఒత్తిడి చేయరని తెలిపారు. ఒత్తిడి చేస్తే మీరు రవాణా శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. గాయపడిన వ్యక్తిని ఆస్పత్రిలో చేర్చి వెళ్లిపోవచ్చున్నారు. ఆస్పత్రి సిబ్బందికి మీ అడ్రస్ ఇవ్వాలనిపిస్తే ఇవ్వవచ్చన్నారు. గాయపడిన వారిని కాపాడినందుకు రవాణా శాఖ తరపున ప్రోత్సాహ బహుమతి, నగదు, ప్రశంసాపత్రం అందజేస్తారన్నారు. అంతేకాక ఆ ప్రమాదంలో నగదు సహాయం చేసి ఉంటే అది కూడా ఇస్తారన్నారు. ఏడాదిలో పలుమార్లు కాపాడిన వ్యక్తిని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న బహుమతి వచ్చేందుకు మీ పేరును కూడా పంపుతామన్నారు. కార్యక్రమంలో ఎంవిఐ ప్రసాద్ పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అర్హులందరికీ లబ్ధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల


మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వైసిపి పాలనలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలతో లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 13, 14 వార్డుల్లో మంగళవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి ప్రతి గడపకు తిరిగారు. వీరి రాకను స్వాగతిస్తూ 13, 14 వార్డు కౌన్సిలర్లు గౌస్, షాహిద్, స్థానిక నేతలు బాణాసంచా పేల్చి, పూలమాలలు వేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. అందిన పథకాల వివరాలతో ముద్రించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ప్రభుత్వ పథకాల ద్వారా మీ కుటుంబాలకు ఇంత లబ్ధి చేకూరిందని గుర్తు చేశారు. ఆయా వార్డు కౌన్సిలర్లు తమ వార్డులో ఉన్న సామాజిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి బాలయ్య, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, మునిసిపల్ కమిషనర్ జగనాథ్, ఎఇ సురేష్ బాబు, ఆర్ఒ గంగిరెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రమాదకరం.. విద్యుత్ స్తంభం


షాదీఖానా ఎదురు వీధిలో ఒరిగిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి - ఖాజీపేట

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు తమ ప్రాణాలను కోల్పోతున్నారు. విద్యుత్ ప్రమాదాలు తరచూ చోటు చేసుకుంటున్నా ఆ శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ స్తంభాలు నేలకొరగడం, తీగలు కిందికి వేలాడుతుండడం వల్ల ప్రమాదాలు అధికంగా చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాటిని సరి చేయాల్సిన ఆ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయని ప్రజలు బయాందోళనకు గురవుతున్నారు. స్థానిక టీచర్స్ కాలనీతోపాటు, మండల పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తీవ్రంగా వేధిస్తున్నాయని వాపోతున్నారు. వ్యవసాయ పంట పొలాల్లో స్తంభాలు నేలకొరిగాయని, వాటిని సరి చేయకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారుల స్పందించి విద్యుత్ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సియోనుపురంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కడప

కడప నగరం 22/2 మారుతీనగర్–4 వార్డు హెల్త్ సెక్రటరీ హబీబున్నీసా బేగం, డాక్టర్ బషీర్ అహ్మద్ ఆధ్వర్యంలో మంగళవారం సియోనుపురంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు, వృద్ధులకు, మహిళలకు, పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బీపీ, షుగర్ వంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు ఇచ్చి తగు జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో సీనియర్ ఎఎన్ఎం అరుణకుమారి, ఆశా వర్కర్లు సి.లక్ష్మిదేవి, వసంత, స్టాఫ్ నర్సు పార్వతి పాల్గొన్నారు. ఉచిత వైద్య శిబిరం ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ బషీర్ అహ్మద్, హబీబున్నీసా బేగం

ఎస్‌హెచ్‌జిలకు రూ.2.62 కోట్ల రుణాలు


మహిళలకు చెక్కు అందిస్తున్న బ్యాంక్ అధికారులు

ప్రజాశక్తి - మైలవరం

మండలంలోని 34 స్వయం సహాయక సంఘాలకు రూ.2.62 కోట్లు రుణం మంజూరు చేసినట్లు దాల్మియా సిమెంట్ పిఆర్ఒ జయ రామకృష్ణారెడ్డి తెలిపారు. డిఆర్‌డిఎ వైఎస్ఆర్ క్రాంతి పథం, దాల్మియా భారత్ ఫౌండేషన్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ భాగస్వామ్యంతో మంగళవారం తొమ్మిది గ్రామాల స్వయం సహాయక సంఘాలకు రుణ వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడు గ్రామా సమైక్య సంఘంలోని 22 సంఘాలకు రూ.29 లక్షల రుణ వితరణ చేశారు. రెండు రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు రూ.2లక్షలు వితరణ చేశామని పేర్కొన్నారు. సిఎస్ఆర్ హెడ్ వి.రామరాజు మాట్లాడుతూ సంఘం సభ్యులకు ఇచ్చిన రుణాన్ని జీవనోపాధికి ఉపయోగించుకోవాలని సూచించారు. మైలవరం ఎపిజి బ్యాంక్ మేనేజర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలకు తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దాల్మియా సహాయ మేనేజర్ శ్రీనివాసులు, గురుదేవి స్వయం సహాయక సంఘ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల అభ్యున్నతికి కృషి

- ఎంఎల్‌సి అభ్యర్థి ఎం.వి.రామచంద్రారెడ్డి


ప్రజాశక్తి - కడప అర్బన్



మూడ దశాబ్దాల కిందట అక్కాయపల్లె, చెమ్మూమియాపేట పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో ఐటిఐ సర్కిల్ వద్ద పాఠశాలను ఎం.వి.రాచంద్రారెడ్డి ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అంచ లంచలుగా ఎదుగుతూ సౌమ్యుడు, వివాద రహితుడిగా పేరొందిన ఈయన ప్రస్తుతం పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ప్రయివేట్ విద్యా సంస్థలను నెలకొల్పిన తాను ఇప్పటి వరకు వేల మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దామని తెలిపారు. ప్రయివేట్ విద్యాసంస్థల జిల్లా నాయకుడిగా ఉంటూ క్రమేపి ఎదుగుతూ 'అపుస్మా' రాష్ట్ర అధ్యక్షులుగా 4 ఏళ్ల నుంచి కొనసాగుతున్నానని చెప్పారు. వ్యక్తిగతంగా, సంఘ పరంగా అనేక సేవా కార్యక్రమాలు చేశామని పేర్కొన్నారు. తుఫాను ప్రభావిత ప్రాంతాలలో అక్కడి ప్రజలతో మమేకమై లక్షలాది రూపాయలు విలువైన సామగ్రిని అందించామని చెప్పారు. కరోనా సమయంలో రూ.50లక్షల చెక్కును సంఘం తరపున సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి అందించామన్నారు. వ్యక్తిగతంగా ఉపాధ్యాయులకు, ప్రజలకు నిత్యావసర సరుకులు పలుదఫాలుగా అందించామని పేర్కొన్నారు. తమ సేవలను గుర్తించిన అనేక స్వచ్ఛంద సంస్థలు అవార్డులను ప్రదానం చేశాయని తెలిపారు. మూడు జిల్లాల్లోనేగాక రాష్ట్ర వ్యాప్తంగా అనేకమంది ప్రముఖులతో పరిచయాలు ఉన్నాయని చెప్పారు. 25 సంవత్సరాలుగా క్రియాశీలక రాజకీయాల్లో ఉంటూ ప్రత్యక్ష ఎన్నికల్లో తమ బంధువులను నిలబెట్టి గెలిపించుకున్నామన్నారు. తన సతీమణి ఎం.వి.శ్రీదేవి 46వ డివిజన్ కార్పొరేటర్‌గానే కాక వైవీయూ పాలకమండలి సభ్యులుగా కొనసాగుతున్నారని పేర్కొన్నారు. తమ సేవలను గుర్తించిన వైసిపి నాయకత్వం ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థిత్వానికి మద్దతు ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. ఉపాధ్యాయ సంఘాలు పిఆర్‌టియు, వైఎస్ఆర్‌టిఎఫ్, పిఇటి అసోసియేషన్, జూనియర్, డిగ్రీ కళాశాలల అసోసియేషన్ సంఘాల మద్దతు పొందానని పేర్కొన్నారు. ప్రజలకు, ఉపాధ్యాయులకు అందుబాటులోఉంటూ నిబద్ధత కలిగిన నాయకుడిగా ఉండడంతో అందరి అభిమానాన్ని చూరగోనేందుకు ఉపయోగపడిందన్నారు. ఎన్నికల్లో ప్రచారం వేగవంతం చేశామని, ప్రచారంలో ముందున్నామని తెలిపారు.

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి - జమ్మలమడుగు



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న ఉపాధ్యాయులు, పాఠకులు

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాయలంలో మంగళవారం ప్రదర్శించిన పుస్తక ప్రదర్శన ఆకట్టుకుంది. గ్రంథాల యాధికారి జింక చంద్ర శేఖర్ పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల సాహిత్యం, కథల పుస్తకాలు, నవలలు, దేశ నాయకుల జీవిత చరిత్ర, హిందీ, ఆంగ్ల పుస్తకాలు, నిఘంటువులు, వంటలు, జోక్స్, వ్యక్తిత్వ వికాసం, కంప్యూటర్ పుస్తకాలు, ఖురాన్, బైబిల్ భగవద్గీత, భారత రామాయణాలు వంటివి ప్రదర్శనలో ఉంచామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, రమణ, ఇమాన్ హుస్సేన్, పాఠకులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : పట్టణంలోని గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబుల్‌రెడ్డి ప్రారంభించారు. కృష్ణ చైతన్య స్కూల్ కరస్పాండెంట్ రామమోహన్ రెడ్డి తమ స్కూల్ పిల్లలతో పుస్తక ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో లైబ్రరీ రికార్డు అసిస్టెంట్ ఉమాదేవి, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి గుర్తింపునకు సర్వే

ప్రజాశక్తి - చాపాడు

కుష్టు వ్యాధి గుర్తింపునకు గ్రామాల్లో ప్రతి ఇంటికెళ్లి సర్వే చేస్తున్నట్లు మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. చర్మంపై స్పర్శ లేని మచ్చలను గుర్తిస్తున్నామన్నారు. మండలంలోని బద్రిపల్లెలో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక దశలోనే మందులు వాడడం వల్ల కుష్టు వ్యాధిని అరికట్టవచ్చని తెలిపారు. చర్మం మీద స్పర్శలేని మచ్చలు, చర్మంపై బొడిపెలు, పొడి బారిన చర్మం, వ్యాధి సూచన ప్రాంతంలో చెమట పట్టకపోవడంవ వంటి కుష్టు వ్యాధి లక్షణాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ రాముడు, సూపర్వైజర్ సరస్వతి, పర్యవేక్షకులు రమేష్, భాస్కర్ నారాయణరెడ్డి, ఎన్ఎంలు పాల్గొన్నారు. బద్రిపల్లె సర్వేలో ఎంఎల్‌హెచ్‌పి అనిత, ఎఎన్ఎం జాస్మిన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ఈనెల 15 నుంచి డిశంబర్ 5వ తేదీ వరకు జరుగుతున్న కుష్టు వ్యాధి గ్రస్తుల గుర్తింపు నేపథ్యంలో ఇంటింటి సర్వే చేస్తున్నట్లు డాక్టర్ హనీఫ్ బాబా తెలిపారు. కుష్టు రహిత సమాజం కోసం ఆరోగ్య సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు. మంగళవారం కామనూరు, భగత్‌సింగ్ కాలనీ హౌసింగ్ బోర్డ్ కాలనీలో జరుగుతున్న సర్వేను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రజలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వరప్రసాద్, సిహెచ్ఒ క్రిష్ణమ్మ, హెచ్ఇ శోభరాణి, చంద్రకళ, ఆరోగ్య కార్యకర్త నాన్సి, సుమలత, ఆషా కార్యకర్తలు స్వర్ణలత, కల్యాణి, నాగలక్ష్మీ పాల్గొన్నారు.


ఇంటింటి సర్వేను పర్యవేక్షిస్తున్న డాక్టర్ హనీఫ్ బాబా

నవరత్నాలపై దుష్ప్రచారం తగదు

ప్రజాశక్తి - కడప

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలపై పచ్చ బ్యాచ్ దుష్ప్రచారం చేయడం తగదని చింతకొమ్మదిన్నె జడ్‌పిటిసి నరేన్ రామాంజులు రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడప వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకకాలంలో 25 లక్షల మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇచ్చిన ఘనత జగనన్న ప్రభుత్వానిది అని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో ప్రయివేట్ వ్యక్తుల నుండి భూముల కొనుగోలు చేసి పేదలకు ఇళ్ళ స్థలలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతిపక్ష, జనసేన పార్టీ చేస్తున్న నిరాధార ఆరోపణలను ప్రజలు గమని స్తున్నారని జడ్‌పిటిసి పేర్కొన్నారు.